క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సారవకోట: మండలంలోని బురుజువాడలో గల నీలమణి అమ్మవారు, చెవిటమ్మ తల్లి ఆలయాల వార్షికోత్సవాలను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తల్లిదండ్రులు దైవ సమానులు



విగ్రహావిష్కరణలో పాల్గొన్న ధర్మాన కృష్ణదాస్, నాయకులు

సారవకోట: తల్లిదండ్రులు దైవ సమానులని నరసన్నపేట మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని పెద్దలంబలో ఆ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు లుకలాపు భాస్కరరావు తల్లి ఇటీవల మృతి చెందడంతో ఆమె విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, పార్టీ సారవకోట, పోలాకి మండల కమిటీ అధ్యక్షులు వరుదు వంశీకృష్ణ, కణితి కృష్ణారావు, వైస్ ఎంపీపీ ఎడ్ల అసిరయ్య, సర్పంచ్‌లు బాడాన కృష్ణారావు, ఇసై షణ్ముఖరావు, పార్టీ నాయకులు పల్లి కృష్ణారావు, యాళ్ల శ్యామసుందరరావు, బొంగు కొండయ్య, పారశెల్లి తేజేశ్వరరావు పాల్గొన్నారు.

నీలమణిదుర్గ ఆలయ హుండీ లెక్కింపు రేపు

పాతపట్నం: ఈ నెల 30న మండల కేంద్రంలోని నీలమణిదుర్గ ఆలయం హుండీ కానుకలను లెక్కించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ టి.వాసుదేవరావు బుధవారం తెలిపారు. ఉదయం పది గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. మార్కెట్ యార్డ్ ఎదురుగా ఉన్న వెంకటేశ్వర ఆలయం హుండీ కానుకలను శుక్రవారం సాయంత్రం మూడు గంటలకు లెక్కిస్తామని ఈఓ తెలిపారు. లెక్కింపునకు హాజరైన భక్తులు డ్రెస్‌కోడ్ పాటించాలన్నారు.

పరామర్శ..



బొని గిరిని పరామర్శిస్తున్న మామిడి శ్రీకాంత్

పాతపట్నం: మండలంలోని సీది సర్పంచ్ బొని పార్వతీ కుమారుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొని గిరికి ఇటీవల గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ బుధవారం సీది గ్రామంలోని గిరి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్ది నారాయణరెడ్డి, తదితరులు ఉన్నారు.

ఆదివాసీలకు అండగా ఉంటా



సమస్యల గురించి అడిగి తెలుసుకుంటున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు

బూర్జ: ఆదివాసీలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు బడిత్యా శంకరనాయక్ తెలిపారు. మండలంలోని వైకుంఠపురం పంచాయతీ అల్లిపల్లి గిరిజన గూడలో బుధవారం పర్యటించారు. గిరిజనులకు అందుతున్న సదుపాయాలు, ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. రహదారులు, విద్యుత్ సమస్యలున్నట్లు గిరిజనులు వివరించారు. స్థానిక సర్పంచ్ బొడ్డేపల్లి వెంకటసత్యం, ఆదివాసీ సంక్షేమ సంఘం రాష్ట్ర పరిషత్ ఉపాధ్యక్షుడు వాబ యోగి, జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్, తహసీల్దార్, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

వేళకు తెరవకపోతే కఠిన చర్యలు

సరుబుజ్జిలి: అంగన్‌వాడీ కేంద్రాలు సమయానికి తెరవకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా బాలల హక్కుల పరిరక్షణ కన్వీనర్ కొత్తకోట శ్రీనివాసరావు హెచ్చరించారు. రొట్టవలస గ్రామంలో నిర్వహించిన సెక్టార్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు సక్రమంగా సరకులు అందించాలని సూచించారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరిగినా, బాలల హక్కులకు భంగం వాటిల్లినా వెంటనే సమాచారం అందించాలన్నారు. సూపర్‌వైజర్ రత్నాంజలి, కార్యకర్తలు పాల్గొన్నారు.



భద్రత అవసరం

మహిళలపై హత్యాచారాలు రోజురోజూకూ అధికమవుతున్నాయి. ప్రాణాలు పోసే డాక్టర్లు, సిబ్బందికే రక్షణ కరువైంది. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన దేశం మొత్తాన్ని కుదిపేసింది. రాత్రి సమయంలో మహిళలకు భద్రత కల్పించాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఎంతైనా ఉంది.

– వాన గౌతమి, స్టాఫ్‌నర్స్, పీహెచ్‌సీ, చొర్లంగి, హిరమండలం



కఠిన చర్యలు తీసుకోవాలి

కోల్‌కతా వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనకు కారకులైన వారిపట్ల చట్టాలు కఠినంగా వ్యవహరించాలి. వైద్యులకే రక్షణ లేనప్పుడు ప్రజలకు ఎలా సేవలు అందించగలరు. ఇంతవరకు వేయని కఠిన శిక్షలను దోషులకు వేయాలి. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

– సోనియా, వైద్యురాలు, పురుషోత్తపురం పీహెచ్‌సీ, సరుబుజ్జిలి



ఈ-క్రాప్‌తో బహుళ ప్రయోజనాలు

- ప్రారంభమైన పంటల నమోదు
- సెప్టెంబర్ 15 వరకు గడువు పెంపు

నియోజకవర్గంలో ఇప్పటివరకు పంట నమోదు వివరాలు (ఎకరాల్లో)

మండలం	సాగుభూమి	ఈ-పంట నమోదు	శాతం
పాతపట్నం	16,953	4,753	32
హిరమండలం	7,101	2,179	30
కొత్తూరు	13,244	3,811	28
మెళియాపుట్టి	14,020	4,536	32
ఎల్.ఎన్.పేట	9,659	5,410	50



హిరమండలంలో ఈ-పంట నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

హిరమండలం: ఈ-పంట నమోదుతో రైతులకు ఎన్నో ప్రయోజనాలున్నాయి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పాతపట్నం నియోజకవర్గ వ్యాప్తంగా 60,977 ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేస్తున్నారు. ఇప్పటివరకు 20,689 ఎకరాల్లో అధికారులు పంట నమోదు చేశారు. ఈ-పంట నమోదుతో రైతులకు కలిగే ఉపయోగాలను గ్రామాల్లోని రైతు సేవా కేంద్రం సిబ్బంది వివరిస్తున్నారు. ఈ విషయంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

పంటల నమోదు తప్పని సరి

పంటలు సాగుచేసిన తరువాత ప్రతీరైతు ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలి. పంట నమోదు ప్రక్రియను రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా ప్రారంభించాయి. గ్రామానికి వచ్చే రెవెన్యూ అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బందికి సహకరించి తమ పంటను నమోదు చేయించుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉంది. ఇందుకు పట్టాదారు పాస్‌పుస్తకంతోపాటు పాసు పుస్తకంలోని సర్వే నంబర్లన్నీ ఆన్‌లైన్‌లో నమోదై ఉండాలి. ప్రతీ రైతు తమ పొలం వద్ద పట్టాదారు పాసుపుస్తకం, 1బీ, ఆధార్ కార్డ్, బ్యాంకు ఖాతా పుస్తకం అందుబాటులో ఉంచుకొని నమోదు చేయించుకోవాలి. పొలాల్లో పంటసాగు చేసిన వాటికి కాకుండా కొంత మంది రైతులు వేరే పంటలను నమోదు చేయించుకుంటే భవిష్యత్‌లో కష్టాలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. సాగులో ఒక పంటవేసి ఈ-పంట నమోదులో వేరే పంట చూపించడం వల్ల ఉత్పత్తులను విక్రయించే సమయంలో ఇబ్బంది పడాల్సి వస్తోందని తెలుపుతున్నారు.

ఉపయోగాలు ఇలా..

- సాగుచేసిన పంటలను ఈ-పంట నమోదు చేసుకోవడం వల్ల గ్రామ విస్తీర్ణం, మండల విస్తీర్ణం ఏయే పంటలు సాగుచేశారో అధికారులకు తెలుస్తోంది..
- కరువు పరిస్థితులు ఏర్పడినప్పుడు ఏయే పంటలు నష్టపోయారు. ఎంత విస్తీర్ణం, ఎంతమంది రైతులు అనే అంశాలు స్పష్టంగా ఉంటాయి.
- విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లపై రాయితీ, పంటల బీమా, అన్నదాత సుఖీభవ తదితర పథకాలు నుంచి లబ్ధి పొందవచ్చు.
- మద్దతు ధరతో పంట దిగుబడులను విక్రయించే సమయంలో ఎటువంటి సమస్య లేకుండా పంటసాగు ధ్రువీకరణ పత్రం పొందడానికి వీలు ఉంటుంది.

గడువులోగా నమోదు చేయించుకోవాలి



ఆగష్టు 5వ తేదీ నుంచి ఈ-పంట నమోదు ప్రారంభమైంది. సెప్టెంబర్ 15వ తేదీ లోగా పంటలు సాగుచేసిన రైతులు తప్పకుండా పంటలను ఈ-పంటలో నమోదు చేయించుకోవాలి. ఇచ్చిన గడువులోగా పంట నమోదు ప్రక్రియను పూర్తి చేస్తాం.

– బి.సంధ్య, ఏఓ, హిరమండలం

అమ్మ భాషకు వందనం



ఆమదాలవలస: గిడుగు జీవిత విశేషాలతో కవి కె.వి.రాజారావు వేసిన చిత్రం



కొత్తూరు: కుదుమ తిరుమలరావు గీసిన రామ్మూర్తి పంతులు చిత్రలేఖనం



నరసన్నపేట: గిడుగు అక్షర రూపంలో విద్యార్థులు

ఆమదాలవలస/కొత్తూరు /నరసన్నపేట:ఈ నెల 29వ తేదీన తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకుని ఆమదాలవలసకు చెందిన కవి, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు కుప్పిలి వెంకటరాజారావు గిడుగు రామ్మూర్తి పంతులు జీవిత విశేషాలతో ఆయన చిత్రాన్ని వేశారు. గిడుగు బాటలో భాషాభివృద్ధికి కుప్పిలి కృషి చేస్తున్నారు. సామాజిక స్పృహ ఉన్న నాటకాలు రాస్తూ అభ్యుదయ కవిగా సేవలందిస్తున్నారు. అలాగే కొత్తూరు మండలంలోని కదుము జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు కుదుమ తిరుమలరావు గీచిన గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రలేఖనం ఆకట్టుంది. నరసన్నపేట మండలం సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 'గిడుగు' అక్షరమాల రూపంలో కూర్చొని ఆకట్టుకున్నారు. గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు హెచ్ఎం వకులా రత్నమాల తెలిపారు.

ఈ-క్రాప్ వేగవంతం చేయాలి

ఎల్.ఎన్.పేట: మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల పరిధిలోనూ ఈ-క్రాప్ నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలని ఏఓ పైడి లతశ్రీ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ-క్రాప్ నమోదులో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవన్నారు. మండలంలోని 47 రెవెన్యూ గ్రామాల్లోనూ ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయాలన్నారు. రైతులతో కలిసి పొలాలకు వెళ్లి పంట పొలం వద్దనే ఫొటోలు తీసి రైతుల వివరాలు, సర్వే నంబర్లు, పంటల వివరాలను సక్రమంగా నమోదు చేయాలన్నారు. ఈ-పంట నమోదుకు ఇచ్చిన గడువు కంటే ముందుగానే పూర్తిచేయాలని సూచించారు.

పారామిలటరీ అసోసియేషన్ భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి, పారామిలటరీ సైనికులు

నరసన్నపేట: దేశ సరిహద్దుల్లో వివిధ విభాగాలకు చెందిన పారామిలటరీ సైనికుల సేవలు వెలకట్టలేనివని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నరసన్నపేటలో పారామిలటరీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నరసన్నపేటలో పారామిలటరీ సైనికుల కోసం భవనం నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలో ఉన్న మాజీ, ప్రస్తుతం పారామిలటరీ సైనికుల విరాళాలతో ఈ భవనం నిర్మించామని, దీనికి స్థలాన్ని నరసన్నపేట మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఇచ్చారని సంఘం అధ్యక్షుడు కె.రామారావు తెలిపారు. ముఖ్య అతిథిలుగా వచ్చిన కేంద్ర సంఘం కార్యదర్శి రణబీర్ సింగ్, కమాండెంట్ చింతాడ రంగనాథం తదితరులు మాట్లాడుతూ పారామిలటరీ సైనికుల సేవలు వివరించారు. సంఘం ప్రతినిధులు జీఎస్‌బీ సుబ్రహ్మణ్యం, ఎస్.రవి మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి సైనికులకు లభించాల్సిన సంక్షేమ పథకాలు అమలు కావడం లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు పారామిలటరీ సైనికులకు ప్రభుత్వం తరపున అన్ని పథకాలు అందించాలని సంఘం ప్రతినిధి కోట్ని లక్ష్మణరావు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు యాళ్ల అపలనాయుడు, గంగిట్ల శ్రీనివాస్, ఆట్ల సుమన్, డోల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పశుగణన సక్రమంగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ జయంత్ ప్రసాద్

పాతపట్నం: భారత ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ పి.జయంత్ ప్రసాద్ అన్నారు. స్థానిక కోర్టు కూడలిలో ఉన్న పశుసంవర్ధకశాఖ ఏడీ కార్యాలయంలో పశుగణనపై క్షేత్రస్థాయి సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాతపట్నం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు మాట్లాడుతూ క్షేత్రస్థాయి సిబ్బంది అందరూ సెప్టెంబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు పశుగణన కార్యక్రమంలో పాల్గొని కచ్చితమైన వివరాలు సేకరించాలని ఆదేశించారు. ప్రతి విషయ సేకరణదారుడు (ఎన్యూమరేటర్) రోజుకు 30 నుంచి 35 ఇళ్లకు సంబంధించిన పశు వివరాలు సేకరించాలన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ముద్ద చర్మ వ్యాధి టీకాలు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. గాలికుంటు వ్యాధి నివరాణ టీకాలు ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభిస్తామన్నారు. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్ల కోసం అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు సేకరించాలన్నారు. ఈ సమావేశంలో పశు వైద్యులు పి.అనిల్‌కుమార్, బి.శ్రీవాణి, కె.మౌనిక, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ ప్యాకేజీలు ఇప్పించండి



చీపురుపల్లిలో నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సుదర్శన దొర

మెళియాపుట్టి: మండలంలోని ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని పలువురు నిర్వాసితులు టెక్కలి ఆర్డీఓ సుదర్శన దొరను కోరారు. ఇటీవల మంత్రి, కలెక్టర్లను నిర్వాసితులు కలిసి సమస్యల పరిష్కారంపై వినతిపత్రాన్ని అందించారు. అందులో భాగంగానే బుధవారం నిర్వాసిత గ్రామాలైన చీపురుపల్లి, దాసుపురం గ్రామాల ప్రజలతో సమావేశమయ్యారు. పలువురు నిర్వాసితులు మాట్లాడుతూ... సుమారుగా 80 మందికి ఆర్‌అండ్‌ఆర్ యూత్ ప్యాకేజీలను అందజేయాల్సి ఉందని, ఐదుగురికి పట్టాలు అందించి స్థలాలు చూపలేదని, మరో 11 మందికి పట్టాలు, స్థలాలు కూడా ఇవ్వలేదని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో సొంత జిరాయితీ స్థలాల్లో దేవాలయాలు నిర్మాణం చేపట్టామని, భూములకు, దేవాలయాల నిర్మాణానికి అయిన ఖర్చు సైతం ఇవ్వలేదన్నారు. ఆర్డీఓ స్పందిస్తూ.. ఈ సమస్యలు ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. తహసీల్దార్ నందిగాం హనుమంతరావు, ఎంపీడీఓ చంద్రకుమారి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ



మొక్కలు అందజేస్తున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్, వెలుగు ఏపీఎం

ఆమదాలవలస: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు స్టేట్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ కిరణ్ బుధవారం మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వెలుగు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఏపీఎం పైడి కూర్మారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గించి జీవరాసులన్నింటికీ అవసరమైన ఆక్సిజన్‌ను చెట్లు ఉచితంగా అందిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు క్లస్టర్ కో ఆర్డినేటర్లు రమణ, చందరరావు, రామప్పడు, హరికృష్ణ, ఉమ, సుభద్ర, స్టేట్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ కామేశ్వరరావు, మధు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా బాధ్యతల స్వీకరణ



బి.లావణ్య

పాతపట్నం: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా బి.లావణ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం మాన్యం జిల్లా దిశ సెల్ నుంచి బదిలీలో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ మహమ్మద్ యాసిన్ హిరమండలం పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా బదిలీపై వెళ్లారు. ఎస్‌ఐ లావణ్యకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు.

పొందూరు ఎస్‌ఐగా..



ఎస్‌ఐ సత్యనారాయణ

పొందూరు: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా వి.సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇచ్ఛాపురం టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి పొందూరు పోలీస్ స్టేషన్‌కి బదిలీపై వచ్చారు.

విద్యతోనే సమగ్రాభివృద్ధి

కొత్తూరు: విద్యతోనే మహిళలు అన్ని రంగాల్లోనూ సమగ్రాభివృద్ధి సాధించవచ్చని వన్ స్టాప్ సెంటర్ ప్రతినిధి కవిత అన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వన్ స్టాప్ సెంటర్ల ద్వారా ఆడ పిల్లలను చదివిద్దాం.. ఆడ పిల్లలను రక్షిద్దాం అనే కార్యక్రమాన్ని మండలంలోని వసప కేజీబీవీలో ప్రిన్సిపాల్ రాధిక అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. బాలికలు, మహిళలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై కవిత అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలు ఆపదలో ఉన్నప్పుడు 100, 1098, 181, 112 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. వన్ స్టాప్ సెంటర్లలో కౌన్సెలింగ్, న్యాయ సహాయం, ఆశ్రయం, వైద్య సహాయం, పోలీస్ సహాయాన్ని బాధిత మహిళలకు అందివ్వడం జరుగుతుందన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి



గాయపడిన లక్ష్మీనారాయణ

సారవకోట: మండల కేంద్రానికి సమీపంలో గల కొత్తూరుకు వెళ్లే బస్ షెల్టర్ దగ్గర మంగళవారం రాత్రి పద్మాపురం గ్రామానికి చెందిన చౌదరి లక్ష్మీనారాయణపై దాడి జరిగింది. ఈ దాడిలో లక్ష్మీనారాయణ తలకు గాయాలయ్యాయి. సారవకోట గ్రామానికి చెందిన వాబ యోగేశ్వరరావుతోపాటు ఆయన సహచరులు తనపై రాత్రి 8 గంటల సమయంలో దాడి చేసి గాయపర్చినట్లు సారవకోట పోలీసు స్టేషన్లో మంగళవారం రాత్రి లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులకు వివరణ కోరగా.. ఫిర్యాదును వెనక్కి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తాను ఫిర్యాదును వెనక్కి తీసుకోలేదని లక్ష్మీనారాయణ తెలిపారు. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయపోరాటం చేస్తానన్నారు.

రోగుల అవస్థలు



విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అవస్థలు పడుతున్న రోగులు

నరసన్నపేట: స్థానిక ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిస్తే రోగులు అవస్థలు పడుతున్నారు. బుధవారం రాత్రి 7.40 నుంచి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జనరేటర్ ఉన్నా కనెక్టింగ్ కేబుల్స్ మరమ్మతులకు గురైంది. ఎప్పుడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినా రోగులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు. దీనికి సంబంధించి ఆస్పత్రి సూపరింటెండెంట్ జయశ్రీ వద్ద ప్రస్తావించగా.. జనరేటర్ కేబుల్ మరమ్మతులకు హెచ్‌డీఫ్ నిధులు రూ.1.82 లక్షలతో ప్రతిపాదనలు పంపామన్నారు. అనుమతి వచ్చిన వెంటనే పనులు పూర్తిచేసి, ఆ తరువాత జనరేటర్‌ను వినియోగంలోనికి వస్తే విద్యుత్ సమస్యలు ఉండవన్నారు.

మంచినీటి పైపులైన్ ధ్వంసం



మాకివలసకు వెళ్లే పైపులైన్‌ను కోసి వేసిన దృశ్యం

సారవకోట: మండలంలోని అలుదు రక్షిత మంచి నీటి పథకం పైపులైన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి కోసేశారు. ఈ మంచినీటి పథకం ట్యాంక్ మాకివలస సమీపంలో ఉన్న కొండపై నిర్మించారు. అక్కడ నుంచి మాకివలస, వడ్డినవలస గ్రామాలకు పైపులైన్ల ద్వారా నీరు సరఫరా అవుతుంది. బుధవారం ఉదయం పంప్ ఆపరేటర్ తాలాడ రాము దీనిని గమనించకుండా యథావిధిగా నీటిని విడిచిపెట్టారు. మార్గమధ్యంలో పైపులైన్‌ను కోసి ఉంచడంతో నీరు వృథాగా పోవడాన్ని గమనించారు. అనంతరం సర్పంచ్ సాగిపల్లి దండాశికి తెలియజేశారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ తేజేశ్వరరావుకు సమాచారం ఇచ్చారు. ఈయన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు విద్యుత్ వైర్లు ఇదే విధంగా కత్తిరించారని, మంచినీటి పథకం వాల్స్ తొలగించారని స్థానికులు పలువురు ఆరోపిస్తున్నారు. మంచినీటి పథకం పైపులైన్లు, విద్యుత్ వైర్లు, వాల్స్ నాశనం చేయడం వల్ల రెండు గ్రామాలకు తాగునీరు సరఫరా కావడం లేదని, ఇది మంచి పద్ధతి కాదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పారాపురం ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ



విచారణ చేపడుతున్న అధికారులు

కొత్తూరు: మండలంలోని పారాపురం గ్రామ పంచాయతీలో ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రవి.. వేతనదారుల నుంచి అక్రమ వసూలుకు పాల్పడుతున్నట్లు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో గ్రామానికి చెందిన కొంతమంది వేతనదారులు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం పాతపట్నం ఏపీడీ రాధ, ఎంపీడీఓ పావని పారాపురం వెళ్లి విచారణ చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమ వసూలుకు పాల్పడినట్లు ఫిర్యాదుదారులు విచారణ అధికారుల దృష్టికి తెచ్చారు. వేతనదారుల నుంచి ఎటువంటి అక్రమ వసూళ్లకు పాల్పడలేదని ఫీల్డ్ అసింస్టెంట్ విచారణ అధికారులకు తెలిపారు. తనపై కొంతమంది కావాలనే తప్పుడు ఫిర్యాదులు చేసినట్లు రవి విచారణ అధికారులకు చెప్పారు. విచారణ సమయంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. సర్పంచ్ కుంచాల రత్నాలు, ఏపీఓ ప్రేమలత ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్



పోలాకి పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న ఇసుక ట్రాక్టర్లు

పోలాకి: మండలంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పోలీసులు సీజ్‌చేశారు. డోల నదీతీరంలో, రాజారాంపురం సముద్ర తీరంలో ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రంజిత్ తెలిపారు. మండలంలో ఎలాంటి అధికారిక ఇసుక ర్యాంపులు లేవని, కల్తీ ఉప్పు ఇసుకతో వినియోగదారులు మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.